సాక్షి ఒడిశా

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,21,283లు, బంగారం 3గ్రాముల 300 మిల్లీగ్రాములు, వెండి 30గ్రాముల 550 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కుప్పకూలిన పూరీ రైల్వేస్టేషన్ పోర్టికో

పూరీ రైల్వేస్టేషన్ భవనానికి సంబంధించిన పోర్టికో ఆదివారం కుప్పకూలింది.

- 8లో



ఎంపీ సప్తగిరికి నిరసన సెగ

కొరాపుట్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి రెండోసారి పోటీ చేస్తున్న ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకకు నీలావడి గ్రామంలో నిరసన సెగ తగిలింది.

- 8లో

న్యూస్‌రీల్

భానుడి భగభగ



నిర్మానుష్యంగా మారిన జెస్కో రోడ్డు

రాయగడ: గత రెండు రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 10 గంటల నుంచే పట్టణంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. భానుడి ప్రతాపానికి జనాలు విలవిలలాడుతున్నారు. ప్రతి కూడలిలో స్థానికంగా స్వచ్ఛంద సేవా సంస్థలు చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతీరోజూ బాటసారులకు అందిస్తున్నారు. ఇదిలాఉండగా ఎండలో తిరిగేటప్పుడు వడదెబ్బకు గురవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య శాఖ సూచనలు చేస్తోంది.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పూల కుండీలతో మనం మనం బరంపురం సంస్థ ప్రతినిధులు

బరంపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు అన్నారు. స్థానిక కాపువీధిలోని ఆంధ్ర మహిళా సమాజం ప్రాగణంలో మనం మనం బరంపురం సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలు, పక్షులు నీరు తాగే తొట్టెల పంపిణీ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా పూడిపెద్ది సత్యనారాయణ బాబు, మోనింగి కామేశ్వరి మాట్లాడుతూ.. మానవ తప్పిదాల వలనే ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో విపత్తులు రాకుండా అరికట్టాలంటే ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కొంచడా కుసుమా, బాలకృష్ణ శర్మ, వెంకటరమణ, ఆర్.శ్రీనివాస్‌రావు, సుబుజవాని తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ట్రోఫీ అందజేస్తున్న నెక్కంటి

రాయగడ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని జిల్లా బీజేడీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. సదరు సమితి చందిలి పంచాయతీలోని జేకేపూర్‌లో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలియజేశారు. గత దశాబ్ద కాలంగా రాష్ట్రంలో క్రీడారంగం ఎంతో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉన్నతంగా రాణించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 16 జట్లు పాల్గొనగా, ఓం ఫ్రెండ్స్, శ్రీనివాస్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్స్‌లో ఓం ఫ్రెండ్స్ జట్టు విజయం సాధించింది. విజేతలకు నెక్కంటి బహుమతులను అందజేశారు.

‘ఎన్నికల్లో సహకరించండి’



వివిధ సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న నెక్కంటి భాస్కరరావు

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని తేజస్వీ హోటల్ మైదానంలో వివిధ సంఘాల ప్రతినిధులతో బీజేడీ రాయగడ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు శనివారం భేటీ అయ్యారు. వారితో సుదీర్ఘంగా చర్చించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో సహకరించాలని సంఘాల ప్రతినిధులకు కోరారు. ప్రతీసారిలా ఈసారి కూడా ఎన్నికల్లో బీజేడీకి సహకరించి పార్టీని విజయపథంలో ముందుకు సాగేలా అండగా ఉండాలని కోరారు. బీజేడీ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని తెలియజేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న పార్టీని అందరూ ఆశీర్వదించాలని కోరారు. మహిళల ఆర్థిక సాధికారితతో పాటు వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించి అభివృద్ధి పథంలో నడిపించాలన్నదే ప్రభుత్వ ధ్యేయంగా అభివర్ణించారు.

పొట్టంగిలో.. పోటాపోటీ!

- కొటియా గ్రామాల ఓట్లే కీలకం



రామచంద్ర కదమ్ (కాంగ్రెస్)

ప్రఫుల్ల పంగి (బీజేడీ)

చైతన్య నందబలియ (బీజేపీ)

జయపురం: కొరాపుట్ జిల్లాలో పొట్టంగి నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత ఉంది. ఒకప్పుడు కాంగ్రెస్ కు కంచుకోటగా ఉండేది. కొటియా ముఠా ప్రజలు ఇటు ఒడిశాలోనూ, అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ తమ ఓటు హక్కుని వినియోగిస్తారు. 1951లో జరిగిన ప్రథమ సాధారణ ఎన్నికల సమయంలో పొట్టంగి ప్రాంతం నందపూర్ నియోజకవర్గంలో ఉండేది. 1957 నాటికి నందపూర్ నియోజకవర్గాన్ని రద్దు చేసి పొట్టంగిగా మార్చారు. ఎస్టీలకు కేటాయించిన ఈ స్థానంలో 2019 వరకు జరిగిన 13 ఎన్నికల్లో కాంగ్రెస్ 6 సార్లు విజయం సాధించింది. ప్రస్తుత ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు గెలిపొందిన రామచంద్ర కదమ్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్నారు. బీజేడీ అభ్యర్థిగా ఒకసారి గెలిచిన ప్రఫుల్ల పంగి, బీజేపీ అభ్యర్థిగా చైతన్య నందబలితోపాటు మరో ఏడుగురు అభ్యర్థుల తలపడుతున్నారు. 2014లో బీజేడీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రఫుల్ల పంగి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి రామచంద్రకదమ్‌ను 10764 ఓట్ల తేడాతో ఓడించారు. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి 7.65 శాతం ఓట్లు పొంది మూడో స్థానంలో నిలిచారు. 2019 ఎన్నికలోనూ బీజేడీ విజయం సాధించింది. బీజేడీ అభ్యర్థిగా పీతమ్ పాడి పోటీ చేసి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి రామచంద్ర కదమ్‌ను 4255 ఓట్ల ఆధిక్యతతో ఓడించారు. బీజేపీ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచాడు. 2024 ఎన్నికల్లో బీజేడీ నుంచి ప్రఫుల్ల పంగి, కాంగ్రెస్ నుంచి రామచంద్ర కదమ్, బీజేపీ నుంచి చైతన్య నందబలియతోపాటు 10 మంది బరిలో ఉన్నారు. 2019లో చైతన్య నందబలియ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి 8,238 ఓట్లు పొంది నాల్గో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికలో బీజేపీకి 25,956 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం నందబలియ బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉండటంతో ఓట్టు శాతం పెరిగి కాంగ్రెస్, బీజేడీ అభ్యర్థులకు గట్టి పోటీ ఇస్తారని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రధానమైన పోటీ బీజేడీ, కాంగ్రెస్‌ల మధ్యే ఉంటుందని పరిశీలకుల అభిప్రాయం. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రామచంద్ర కదమ్ 1995, 2009 ఎన్నికల్లో విజయం సాధించారు. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు తలపడుతున్న పొట్టంగిలో వారికి గట్టి పోటీ బీజేపీ అభ్యర్థి నుంచి ఉంటుందని పరిశీలకుల విశ్లేషణ. గత ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఈ నియోజకవర్గంలో బీజేపీ క్రమేణా బలపడుతున్నట్లు స్పష్టమౌతుంది. 2014లో బీజేపీ అభ్యర్థి కృష్ణ చంద్ర జాని 7.65 శాతం (9,401) ఓట్లు పొందారు. 2019 ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన రామచంద్ర పంగి 17.8 శాతం (25956) ఓట్లు పొందారు. బీజేపీ బలం 10.15 శాతం పెరిగిందని స్పష్టం అవుతుంది.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రాయగడ: మంచినీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సంఘటన రాయగడ జిల్లాలోని కాశీపూర్ సమితి దుడుకాబహాల్ పంచాయతీ పరిధి కలియాపాడ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై శనివారం బైఠాయించి నిరసన తెలియజేశారు. వందకు పైబడి ఉన్న కుటుంబాలకు చెందిన సుమారు 500 మంది జనాభా ఉంటున్న ఈ గ్రామంలో మూడు గొట్టపుబావులు ఉన్నాయి. అయితే నెల రోజుల క్రితం రెండు బావులు పాడయ్యాయి. దీంతో ఉన్న ఒక్క గొట్టపుబావిపై గ్రామస్తులంతా ఆధారపడాల్సి వస్తుంది. సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందని గ్రామస్తులు స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న బీడీవో డాక్టర్ అమృత్ రౌత్ గ్రామానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నార. ప్రస్తుతానికి రెండు గొట్టపుబావులను రెండు రోజుల్లో బాగుచేసి మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

నాటుసారా బట్టీలు ధ్వంసం



అరెస్టైన నిందితులను చూపిస్తున్న అధికారులు

బరంపురం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై ఆంధ్ర–ఒడిశా ఎక్సైజ్ అధికారులు ముమ్మరంగా దాడులు చేపట్టారు. బరంపురం ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం జిల్లాలోని పత్రపూర్ బ్లాక్ ఆంధ్ర–ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై దాడులు చేసినట్లు చెప్పారు. సుమారు 2 వేల లీటర్ల బెల్లం ఊటలు ధ్వంస చేసినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అథ్లెటిక్ పోటీలకు రిటైర్డ్ ఏఎస్‌ఐ

- అంతర్జాతీయ క్రీడలకు కిశోర్ చంద్ర రథ్ ఎంపిక



కిశోర్ చంద్ర రథ్‌కు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న పైడిశెట్టి లక్ష్మణరావు

పర్లాకిమిడి: శ్రీలంక రాజధాని కొలంబోలో మే 3 నుంచి 8 వరకు జరుగనున్న సంయుక్త భారత్ ఖేల్ ఫౌండేషన్ 2024 అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎక్సైజ్ రిటైర్డ్ ఏ.ఎస్.ఐ. కిశోర్ చంద్ర రథ్ ఎంపికయ్యారు. ఆయన మరెన్నో విజయాలు సాధించాలని ప్రముఖ వ్యాపారవేత్త పైడిశెట్టి లక్ష్మణరావు రూ.రెండు వేల నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. క్రీడాకారుడు కిశోర్ చంద్ర రథ్ గతంలో నేపాల్, ఢిల్లీ, అనేక జాతీయ అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సంధించారు.

భారీగా గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలతో ఎక్సైజ్ అధికారులు

బరంపురం: గంజాం జిల్లా పరిధి బంజనగర్ చరిచోక్కో జంక్షన్ వద్ద 59వ నంబర్ జాతీయ రహదారిపై టాటా వ్యాన్‌లో బరంపురం వైపు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని బరంపురం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. బరంపురం ఎక్సైజ్ ఎస్పీ రమేంద్ర నాయక్ తెలిపిన వివరాల మేరకు.. కొందమాల్ జిల్లా బల్లిగుడా అటవీ ప్రాంతం నుంచి బంజనగర్ మీదుగా బరంపురం నగరం వైపు వస్తున్న టాటా వ్యాన్‌లో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో కొందమాల్–గంజాం జిల్లాల సరిహద్దు బంజనగర్ పోలీసు స్టేషన్ పరిధి నాలుగు రోడ్ల జంక్షన్‌లో వాహన తనికీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక టాటా వాహనంలో 25 బస్తాల్లోని 265 కిలోల గంజాయిని సీజ్ చేసి నిందిత డ్రైవర్‌ని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి సన్నోఖేముండి బ్లాక్‌కి చెందిన నారాయణ నాయక్‌గా గుర్తించారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా అదివారం మధ్యాహ్నం బరంపురం రైల్వేస్టేషన్‌లో భువనేశ్వర్‌కి అక్రమంగా తరలిస్తున్న 15 కిలోల గంజాయితో పాటు ఒక నిందితుని బరంపురం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి గంజాం జిల్లా సురడా గ్రామానికి చెందిన సుధీర్ కుమార్ నాయక్‌గా గుర్తించినట్లు ఆర్పీఎఫ్ అధికారులు తెలియజేశారు.



ఆర్పీఎఫ్ పోలీసులకు పట్టుబడిన నిందితుడు

బీజేడీ–బీజేపీ రహస్య మిత్రులు

- పేదలను దోచుకోవడమే వారి లక్ష్యం
- ధ్వజమెత్తిన రాహుల్ గాంధీ



ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

భువనేశ్వర్: రాష్ట్రంలో వేర్వేరుగా పోటీ చేస్తున్నట్లు నటిస్తున్న రహస్య మిత్రులు బీజేడీ–బీజేపీ పార్టీలు అని కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. కటక్ జిల్లా సాలేపూర్ ప్రాంతంలో ఆదివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఒడిశా, కేంద్రంలో అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ అనేక హామీలను ఆయన ప్రకటించారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను దోచుకుంటున్నాయని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే వీరి ఆగడాలకు కళ్లెం పడుతుందని అభయమిచ్చారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దోచుకున్న ప్రజాధనాన్ని తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని మహిళల బ్యాంకు ఖాతాలకు నేరుగా నెలకు రూ.2,000 చొప్పున, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున ప్రత్యక్ష నగదు బదిలీ, రూ.500కే ఎల్పీజీ సిలిండర్లు, రైతులకు క్వింటాల్ వరికి రూ.3 వేలు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) లభిస్తుందని వాగ్దానం చేశారు.

పక్కాగా ఉద్యోగం – రాహుల్ గ్యారంటీ

తొలుత పక్కా ఉద్యోగం (పెహ్లీ నౌక్రి పక్కి) పథకం రాహుల్ గ్యారంటీగా ఆయన పేర్కొన్నారు. ఈ హామీ కింద యువతకు ఉపాధి అవకాశాలు తథ్యమని ప్రకటించారు. ఎవరైనా ఉద్యోగం కోసం సంప్రదిస్తే ప్రభుత్వం ఉద్యోగం కల్పిస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యావంతులైన యువతకు అత్యుత్తమ వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తామని తెలిపారు. ప్రజలను లక్షాధికారులుగా మార్చేందుకు రూ.1 లక్ష చొప్పున కోట్లాది ఖాతాలకు నగదు బదిలీ చేస్తామన్నారు. పీఎం నరేంద్రమోదీ పారిశ్రామికవేత్తల రుణాలు మాఫీ చేస్తుంటే, కాంగ్రెస్ మాత్రం రైతుల రుణాలను మాఫీ చేస్తుందని తెలియజేశారు. అధికారంలోకి వస్తే ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీల వేతనాన్ని రూ.400కు పెంచి, దేశంలోని గిరిజనులకు భూమి, అటవీ, నీటి హక్కులను కల్పిస్తామని ప్రకటించారు. సాలేపూర్‌లో ర్యాలీలో ప్రసంగించే ముందు, రాహుల్ గాంధీ సత్యభామాపూర్‌లోని ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్ జన్మస్థలాన్ని సందర్శించి, ఆయన 176వ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేంద్ర పథకాలను అమలు చేయని బీజేడీ సర్కార్

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



బహిరంగ సభలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



బరంపురం బీజేపీ అభ్యర్థులతో జేపీ నడ్డా



బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు

బరంపురం: కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. ఒడిశా రాష్ట్రంలో గంజాం జిల్లా అతి ముఖ్యమైనదని.. రైతులతో పాటు ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను కేటాయించిందన్నారు. అధికార బీజేడీ పార్టీ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ అవినీతికి పాల్పడుతోందని మండిపడ్డారు. బరంపురం నగర శివార్లలోని అంబపువ మైదానంలో జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో నడ్డా ప్రసంగించారు. అధికార పార్టీ బీజేడీ పాలన నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో రైతుల ఆత్మహత్యల సంఖ్య పెరిగిపోయిందని అన్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పాలనలో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందన్నారు. నష్టపోయిన ఖరీఫ్ రైతుల రుణాలు మాఫీ చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహించిందన్నారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 12 మందికి పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో అయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని నడ్డా అన్నారు. ఒడిశా రాష్ట్రంలో కేంద్రం అమలు చేసిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల విషయంలో కూడా ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ఇటువంటి బీజేడీ ప్రభుత్వాన్ని తక్షణమే గద్దె దించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఒడిశా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్, పార్టీ అభ్యర్థులు డాక్టర్ ప్రదీప్ పాణిగ్రాహి, కె.అనిల్ కుమార్ ఉన్నారు.

ముమ్మరంగా అనసూయ ప్రచారం



అనసూయా మఝికి బొట్టుపెట్టి ఆశీర్వదిస్తున్న మహిళ



ప్రచారం నిర్వహిస్తున్న అనసూయా

రాయగడ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రతిష్టాత్మక రాయగడ నియోజకవర్గంలో బీజేడీ అభ్యర్థి అనసూయా మాఝి ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి ప్రప్రథమంగా ఒక మహిళకు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం బీజేడీ కల్పించడంతో మహిళలంతా సహకరించాలని ఆమె కోరుతున్నారు. స్థానిక రైతుల కాలనీ, శాస్త్రీనగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆమె పర్యటించి ప్రచారాన్ని చేపట్టారు. ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్నటువంటి కాంగ్రెస్ అభ్యర్థి అప్పల స్వామి కద్రక, బీజేపీ అభ్యర్థి బసంత కుమార్ ఉలక లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

సాగర్ చుట్టుపక్కల గంజాయి సాగు..?

జయపురం: పట్టణానికి ప్రతిష్టాత్మకమైన చారిత్రక జగన్నాథ్ సాగర్ నేడు గంజాయి మాఫియాకు అడ్డాగా మారిందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటివరకు మారుమూల ప్రాంతాలకే పరిమితమైన గంజాయి సాగు ప్రస్తుతం ప్రధాన పట్టణాలకు సైతం విస్తరిస్తున్నట్లు తెలుస్తోంది. జయపురం పట్టణంలోని జగన్నాథ్ సాగర్ ప్రాంతంలో గంజాయి మొక్కలు బయటపడడం పలు అనుమానాలకు తావిస్తోంది. గంజాయి మాఫియాకు చెందిన వ్యక్తులు ఎవరూ గుర్తించకుండా సాగర్‌లో గంజాయి పండిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా సాగర్ ప్రాంతంలో గంజాయి మొక్కలు బయటపడ్డాయి. ఈ విషయం తెలిసిన కొరాపుట్ జిల్లా ఎక్సైజ్ ఎస్పీ అరుణ కుమార్ పాఢీ వెంటనే చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఎక్సైజ్ సిబ్బంది ఆదివారం సాగర్ ప్రాంతానికి వెళ్లి గంజాయి మొక్కలను పరిశీలించారు. అదనపు జిల్లా కలెక్టర్ ఎస్.జె.రాజకిశోర్ సమక్షంలో 240కి పైగా గంజాయి చెట్లను కనుగొని, వాటిని తొలగించి ఒక చోట దగ్ధం చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



సాగరం చుట్టుపక్కల పెరుగుతున్న గంజాయి మొక్కలు



గంజాయి మొక్కలను తగలబెడుతున్న ఎక్సైజ్ సిబ్బంది

క్లుప్తంగా

రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న జ్యోతి గాంధీ, కుటుంబ సభ్యులు

రాయగడ: రాయగడ బార్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉంటూ న్యాయవాదిగా పలు సేవలు అందించిన సికరసాయి గ్రామానికి చెందిన దివంగత గాంధీ గోపాల్ శేరి జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు రాయగడ బార్ అసోసియేషన్‌కు రూ.లక్ష విరాళాన్ని అందించారు. గాంధీ సతీమణి జ్యోతి గాంధీ ఈ మేరకు ఆదివారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మనాభ దాస్ (టుటు) రూ. లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు చిట్టి కుముందాన్, వి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ క్లబ్ సేవలు విస్తృతం



కర్బూజా పండ్ల ముక్కలను అందజేస్తున్న ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు

పర్లాకిమిడి: స్థానిక మార్కెట్ జంక్షన్ వద్ద ఫ్రెండ్స్ క్లబ్ (మేం అందరం ఒక్కటే) ఆధ్వర్యంలో బాటసారులకు కర్బూజా పండ్ల ముక్కలను సభ్యులు ఆదివారం అందజేశారు. ఎండ తీవ్రతకు కర్బూజా పండ్ల ముక్కలతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఏటా ఎండా కాలంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు జామి పోలిశెట్టి అన్నారు. ఈ కార్యక్రమానికి పైడిశెట్టి మురళి, పైడిశెట్టి నగేష్ తదితరులు సహకరించారు.

బాహిణీపతి ఆరోపణలు అర్థరహితం

- ఇండిపెండెంట్ అభ్యర్థి ప్రీతీష్ పట్నాయక్



మాట్లాడుతున్న ప్రీతీష్, బిరెన్ పట్నాయక్

జయపురం: ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి తనపై చేసిన ఆరోపణలు సత్యదూరమని ఇండిపెండెంట్ అభ్యర్థి ప్రీతీష్ పట్నాయక్ అన్నారు. ఎమ్మెల్యే ఆరోపణలను ఖండించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తాను, తన తండ్రి బిరెన్ పట్నాయక్ కలిసి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం అధిష్టానానికి విజ్ఞప్తులు పంపామన్నారు. పార్టీ టికెట్ లభించనందున తాను స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశానని ప్రీతీష్ పట్నాయక్ వెల్లడించారు. తాను మరే పార్టీలో చేరలేదని, అటువంటప్పుడు పార్టీ క్రమశిక్షణకు ఎలా భంగం కల్పించానని ప్రశ్నించారు. బీజేడీ తనను ఇండిపెండెంట్‌గా నిలబెట్టిందని ఎమ్మెల్యేబాహిణీపతి చేసిన ఆరోపణ అసత్యమన్నారు. బాహిణీపతి అనేక సార్లు పార్టీ క్రమశిక్షణకు భంగం కలిగించారన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో దిలీప్ రాయ్‌కు ఆయన క్రాస్ ఓటింగ్ చేశారని, 2007లో జిల్లా పరిషత్‌లో కాంగ్రెస్‌కు అవసరమైన బలం ఉన్నా.. అధ్యక్ష పదవి పోటీలో ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు. విపక్షాలకు పలుమార్లు బాహిణీపతి సహకరించారని ప్రీతీష్, బిరెన్ పట్నాయక్‌లు తీవ్ర ఆరోపణలు చేశారు.

ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి



ఆలయం ముందు భక్తుల రద్దీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎండ వేడిమి నుంచి రక్షణగా ఈవో ఎస్.చంద్రశేఖర్ ఏర్పాట్లు చేశారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,37,800, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.53,807, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.85 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు. కాగా, ఆలయ కేశఖండన శాలలో తలనీలాల మొక్కులకు రూ.40 టికెట్టు మాత్రమే భక్తుల నుంచి తీసుకోవాలని, అంతకుమించి క్షురకులెవరైనా అదనపు డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఈఓ హెచ్చరించారు. ఈయన వెంట సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు ఉన్నారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాలో 62 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భద్రత పూర్తిస్థాయిలో ఉన్న డిగ్రీ కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, యూనియన్ బ్యాంకు లాకర్లలో ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల డిపాజిట్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



దేవస్థానం పుష్కరిణిలో స్వామివారి చక్రస్నానోత్సవం



శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని పుష్పయాగం శోభ



చిన్నారి రిహాన్సి శాస్త్రీయ నృత్య ప్రదర్శన

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

భువనేశ్వర్: ఖుర్దారోడ్ అకౌంట్స్ కాలనీ బాలాజీ బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా ఆదివారం ముగిశాయి. కొల్లూరు మహేశ్వరశర్మ అర్చక బృందం ఉత్సవాదుల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించింది. ముగింపోత్సవంలో స్వామి వారి పుష్ప యాగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, మహిళా బృందాల కోలాటం ఆహూతులను అలరించాయి. పట్టణ వీధుల్లో స్వామి వారికి శ్రీవారి రథ సేవ నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణం నుంచి సీతారామ ఛక్ మీదుగా ఉత్తరాయణి మందిరం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణం పుష్కరిణిలో స్వామి వారి చక్ర స్నానోత్సవంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవం ఆద్యంతం నిర్వహించిన సామూహిక పూజల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పాలు పంచుకున్నారు. 31వ వార్షికోత్సవాలతో బ్రహ్మోత్సవాల్ని నిర్వహించారు. దేవస్థానం పూర్వ వైభవానికి ఏమాత్రం భంగం కలగకుండా ఏటా రీతిలో బ్రహ్మోత్సవాలు కొనసాగించాలని భక్తజనం అభ్యర్థించింది.



ఖుర్దారోడ్ పట్టణ వీధులో శ్రీవారి రథ సేవ



బ్రహ్మోత్సవ ప్రాంగణంలో మహిళల కోలాట ప్రదర్శన

ఘనంగా మధుసూదన్ దాస్ జయంతి



బరంపురం: గాంధీ నగర్‌లో మధుసూదన్ దాస్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న నగర ప్రముఖులు

బరంపురం: స్వాతంత్ర్య సమర యోధుడు పండిట్ మధుసూధన్ దాస్ నేటి యువతరానికి ఆదర్శప్రాయుడిగా నిలిచారని పలువురు వక్తలు అన్నారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ మైన్ రోడ్డు జంక్షన్‌లో ఆదివారం దాస్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ దాస్ ఒడిశా రాష్ట్రంలో మొదటి న్యాయవాది పట్టభద్రుడిగా గుర్తింపు పొందారన్నారు.

ఒడిశా న్యాయవాదుల దినోత్సవం..

స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో గంజాం బార్ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బార్ కార్యాలయం ఎదుట మధుసూదన్ దాస్ జయంతి సందర్భంగా ఒడిశా న్యాయవాదుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మధుసూదన్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో బార్ సంఘం మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది నయన్ మహాపాత్రో, సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

యూజీఎంఐటీ కళాశాలలో

రాయగడ: ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్ జయంతిని స్థానిక యూజీఎంఐటీ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో గల మధుసూదన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పారిశ్రామిక కేంద్రం పీఓ సవ్యసాచి సాహు, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ పటేల్, రాజేంద్ర ప్రసాద్ మహాపాత్రో, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. రాయగడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో గల మధుసూదన్ విగ్రహానికి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టుటు దాస్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రాయగడ: మధుసూదన్ దాస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది



మధుసూదన్ దాస్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న న్యాయవాదులు

ఎంపీ సప్తగిరికి నిరసన సెగ



నీలావడి గ్రామం వద్ద నిలిచిపోయిన ఎంపీ సప్తగిరి కాన్వాయ్

- కాన్వాయ్‌ని అడ్డుకున్న గ్రామస్తులు

రాయగడ: కొరాపుట్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి రెండోసారి పోటీ చేస్తున్న ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకకు నీలావడి గ్రామంలో నిరసన సెగ తగిలింది. ఆయన కాన్వాయ్‌ని అడ్డగించిన మహిళలు నల్ల జెండాలతో నిరసన తెలియజేశారు. దీంతో కొద్ది సమయం ఆయన కాన్వాయ్‌లోనే ఉండిపోయారు. ఆయన మద్దతుదారులు కిందకు దిగి ఆందోళనకారులతో మాట్లాడారు. వివరాల్లోకి వెళితే.. ఎంపీ సప్తగిరి ఉలకతో పాటు కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ శాసనసభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పవిత్ర సావుంతాలు ఎన్నికల ప్రచారానికి బంధుగాం సమితి నీలావడి గ్రామానికి శనివారం వెళ్లగా ఆ ప్రాంత మహిళలు నల్లజెండాలను చూపించి నిరసన వ్యక్తం చేశారు. లక్ష్మీపూర్ శాసనసభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బంధుగాం సమితి మాజీ వైస్ చైర్మన్ గీతాంజలి పిడికకు టిక్కెట్ ఇప్పిస్తానని నమ్మించి చివరకు ఆమెకు టిక్కెట్టు ఇవ్వకుండా పవిత్ర సావుంతా అనే మహిళకు టిక్కెట్టు వచ్చేలా ఎంపీ సప్తగిరి పావులు కదిపారని ఆందోళనకారులు నినాదాలు చేశారు. టిక్కెట్ కేటాయించే విషయంలో పక్షపాత వైఖరిని అవలంబించిన సప్తగిరిని తామంతా వ్యతిరేకిస్తామని.. కొరాపుట్ జిల్లాలో ఆయన చేపట్టే ఎన్నికల ప్రచారంలో ఇటువంటి తరహా నిరసనలు ఎదురవుతాయని గ్రామస్తులు గ్రామస్తులు స్పష్టం చేశారు.



కాన్వాయ్ ముందు నల్లజెండాలతో నిరసనకారులు

బీజేడీ నుంచి కొనసాగుతున్న వలసలు



బీజేపీలో చేరిన చేరిన విజయకుమార్, మహాపాత్రోలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో బీజేడీ పార్టీ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా బీజేడీ పార్టీ నాయకుడు, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఆర్.విజయకుమార్, రాయగడ బ్లాక్ నారాయణ్‌పురం బీజేడీ యువజన అధ్యక్షుడు మగుని మహాపాత్రోలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. వీరు ఆదివారం బరంపురంలో జరిగిన విజయసంకల్ప సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఎంపీ అభ్యర్థి ప్రదీప్ పాణిగ్రాహి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. వారం రోజులుగా అధికార బీజేడీ నుంచి బీజేపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. పర్లాకిమిడి జిల్లా బీజేపీ అధ్యక్షుడు కోడూరు నారాయణరావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కోర్టుకు గైర్హాజర్

- బెయిల్‌పై విడుదలైన వ్యక్తి మళ్లీ అరెస్టు



శుక్‌దేవ్ హంతాల్

మల్కన్‌గిరి: బెయిల్‌పై విడుదలైన వ్యక్తి నిబంధనల ప్రకారం కోర్టుకు హాజరు కాకపోవడంతో మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు అతన్ని మళ్లీ అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ సమితి నిలాద్రీనగార్ పంచాయతీ సరియగూడ గ్రామానికి చెందిన శుక్‌దేవ్ హంతాల్‌ను 2019లో గంజాయి కేసులో మత్తిలి పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అప్పటి నుంచి మల్కన్‌గిరి జైల్లో మూడు సంవత్సరాల ఆరు నెలలుగా ఉంటున్నాడు. ఇతనికి ఇటీవల బెయిల్ రావడంతో బయటకు వచ్చారు. అయితే నిబంధనల మేరకు కోర్టుకు హాజరు కావాలని పలుమార్లు నోటీసులు పంపించినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో అతన్ని అరెస్టు చేయాలని కోర్టు ఆదేశించింది. చిత్రకొండ సమితికి సమీపంలోని ధారాకొండ ప్రాంతంలో శుక్‌దేవ్ హంతాల్‌ను శనివారం అరెస్టు చేసినట్టు బలిమెల ఐఐసీ దీరెన్ పట్నాయక్ తెలిపారు.

లారీ ఢీకొని ఆర్మీ ఉద్యోగికి గాయాలు

జలుమూరు: మండలంలోని పాగోడుకు చెందిన నేతింటి వైకుంఠరావు ఆదివారం తగరపువలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆర్మీలో సేవలందిస్తున్న వైకుంఠరావు విశాఖ జిల్లా పెందుర్తిలో కుటుంబంతో నివాసముంటున్నారు. స్వగ్రామం పాగోడులో ఓ ఫంక్షన్‌కు హాజరై బైక్‌పై తిరిగి వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



గాయాలతో వైకుంఠరావు

కుప్పకూలిన పూరీ రైల్వేస్టేషన్ పోర్టికో



నిర్మాణ దశలో కుప్పకూలిన స్టేషను పోర్టికో

- నిర్మాణ దశలోనే ఘటన

భువనేశ్వర్: పూరీ రైల్వే స్టేషన్ భవనానికి సంబంధించిన పోర్టికో కుప్ప కూలింది. నిర్మాణ దశలోనే చోటుచేసుకున్న ఈ సంఘటనలో నలుగురు కార్మికులు గాయపడ్డారు. ఆదివారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన కార్మికులను తక్షణమే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. వీరందరి ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ సంఘటనపై విచారణకు ఆదేశించినట్లు తూర్పు కోస్తా రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. పూరీ రైల్వే స్టేషన్ విస్తరణ భవంతిలో భాగంగా నిర్మిస్తున్న ఆవరణ కుప్పకూలిన సమయంలో పనుల్లో ఆరుగురు కార్మికులు ఉండగా నలుగురు గాయపడ్డారు. ఘటనా స్థలానికి అగ్ని మాపక దళం చేరి సహాయక చర్యలు చేపట్టింది. బాధితులు పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిర్మాణ ప్రక్రియలో భారీ యంత్ర పరికరాల వినియోగం కొనసాగుతుండగా ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షుల సమాచారం.

7 క్వింటాళ్ల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: జిల్లా ఎక్సైజ్ అధికారి బింబాధర్ పొండాకు చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలోని ఒక ఇంటి వద్ద అక్రమంగా రవాణా చేసేందుకు గంజాయి సిద్ధంగా ఉంచినట్లు శనివారం సాయంత్రం సమాచారం వచ్చింది. దీంతో చిత్రకొండకు ఒక ప్రత్యేక బృందాన్ని పంపారు. వారు పూజారిగూడ అడవి సమీపంలో దాడి చేయగా, ఒక గుడిసెలో దాచివున్న గంజాయి బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దానిని తూకం వేయగా 780 కిలోలు ఉంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

4 లోక్‌సభ స్థానాలకు.. 38 నామినేషన్లు ఓకే..

- నామినేషన్ పత్రాల పరిశీలన పూర్తి

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి విడత పోలింగ్‌కు సంబంధించి దాఖలైన నామినేషన్ల పత్రాల పరిశీలన పూర్తయింది. మే 13న కలహండి, నవరంగపూర్, బరంపురం, కొరాపుట్ పార్లమెంటరీ నియోజక వర్గాల్లో జరగనున్న ఎన్నికల కోసం దాఖలైన 38 నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నట్టు అధికారులు ఆదివారం ప్రకటించారు. ఒకటి తిరస్కరణకు గురైనట్లు ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి సీఈవో కార్యాలయం వెల్లడించింది. కలహండి లోక్‌సభ స్థానానికి 20, నవరంగపూర్‌కు 10, బరంపురం స్థానానికి 24, కొరాపుట్‌కు 21 నామినేషన్లు దాఖలయ్యాయి. తిరస్కరణకు గురైన నామినేషన్‌ను కొరాపుట్ లోక్‌సభ స్థానానికి చెందినదిగా పేర్కొన్నారు. ఈ పార్లమెంటరీ నియోజక వర్గాల పరిధిలో 28 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి దాఖలైన నామినేషను పత్రాల్లో 256 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయినట్లు ప్రకటించారు. నవరంగపూర్, బరంపురం నియోజక వర్గాలలో పది మంది చొప్పున, జునాగఢ్, నువాపడా, దిగొపాహాండి, చికిటి, కొరాపుట్ , పొట్టంగిలో ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. కాగా నామినేషన్ల ఉపసంహరణ సోమవారం జరగనుంది. అలాగే మే 20వ తేదీన రాష్ట్రంలో రెండో విడత పోలింగ్ జరగనుంది. ఈ విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌పట్నాయక్ హింజిలి అసెంబ్లీ స్థానానికి ఏప్రిల్ 30న తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు, హింజిలి నుంచి నవీన్ పట్నాయక్ ఆరోసారి తిరిగి ఎన్నిక అవ్వాలని ఉవ్విళూరుతున్నారు. ముఖ్యమంత్రి ఉదయం 11.05 గంటలకు తరా తరిణి ఆలయంలో ప్రార్థనలు చేసిన తర్వాత మధ్యాహ్నం 12.35 గంటలకు ఛత్రపురంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో తన నామినేషన్ దాఖలు చేస్తారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

ఇచ్ఛాపురం: ఒడిశాకు చెందిన 50 మద్యం సీసాలు పట్టుకున్నట్లు ఎస్ఈబీ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. ఎస్ఈబీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. అడిషనల్ ఎస్పీ ఎస్ఈబీ డి.గంగాధరం ఆదేశాల మేరకు ఎస్ఐ పి.నరేంద్రకుమార్, బోర్డర్ పెట్రోలింగ్ సిబ్బంది మండలంలోని అరకపద్ర గ్రామంలో ఆదివారం పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ మేరకు కుమ్మరివీధి వెనుక గల జీడితోటల్లో ఒడిశాకి చెందిన 50 మద్యం సీసాలతో ఓ మహిళ పట్టుబడింది. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో కూర్మినాయుడు, ఎస్‌టినాయుడు పాల్గొన్నారు.



ఎస్ఈబీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

‘ఎన్నికల వ్యయం నమోదు చేయండి’



ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలతో మాట్లాడుతున్న అధికారి కేకే శ్రవణ్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు కచ్చితంగా నమో దు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలక అధికారి కేకే శ్రవణ్ కుమార్ ఆదేశించారు. ఆదివారం ఆయన ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. సహాయక వ్యయ పర్యవేక్షకులు, అకౌంటింగ్ టీమ్, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ సభ్యులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం నిబంధల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్, అకౌంటింగ్ టీమ్‌లు ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఆమోదం, ఆమోద యో గ్యం కాని ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలని సూచించారు. రాజకీ య పార్టీలు అభ్యర్థుల ద్వారా నిర్వహించే ర్యా లీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలో అన్నింటినీ వీడియో సర్వేలెన్స్ టీమ్ సభ్యులు రికార్డింగ్ చేసి పరిశీలన సభ్యుల ద్వారా సదరు వీడియో పరిశీలించి వివరాలను అకౌంటింగ్ టీమ్ సభ్యులకు అందజేయాలని, అకౌంటింగ్ టీమ్ సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు రిటర్నింగ్ కార్యాలయం నుంచి ఎన్ని పర్మిషన్లు ఇచ్చారు, వాటి ఖర్చుల వివరాలను అడిగి రిజిస్టర్లను తనిఖీ చేశారు. వార్తా పత్రికల్లో పెయిడ్ ఆర్టికల్స్ ప్రచురిస్తే వాటిపై దృష్టి సారించాలని, ఫిర్యాదు వస్తే ఎలా పరిష్కరిస్తారన్న అంశంపై సంబంధిత అధికారులతో చర్చించారు.

క్లుప్తంగా

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- యువతకు పిలుపునిచ్చిన మేఘాలయ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.ఎన్.కుమార్


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.ఎన్.కుమార్

రాజాం సిటీ: యువత ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని మేఘాలయ చీఫ్ సెక్రటరీ, మాజీ ఐఏఎస్ కె.ఎన్.కుమార్ అన్నారు. స్థానిక ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సివిల్ సర్వీసెస్‌పై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థుల చదువుకు ఫౌండేషన్ ద్వారా అండగా నిలుస్తున్న మదన్‌ను అభినందించారు. ఈ ప్రాంతంలో ఎంతోమంది తెలివైన యువతీయువకులు ఉన్నారని, లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు మెరిట్ స్టూడెంట్స్‌కు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఐజీ జీహెచ్‌పీ రాజు, మాజీ ఐఏఎస్ ఎన్.సాంబశివరావు, ఐఆర్ఎస్ డిప్యూటీ కమిషనర్ డి.కల్యాణచక్రవర్తి, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీ ఆర్ఎస్‌వీ ప్రసాద్, వి.జగన్నాథంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిశీలన


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మోహర్దా

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ఎలిమెంటరీ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న మూడు పోలింగ్‌బూత్‌లను అరకు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మోహర్దా ఆదివారం పరిశీలించారు. మామిడిపల్లిలో ఏర్పాటు చేయనున్న మూడు పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకమైనవిగా అధికారులు గతంలో గుర్తించడంతో వాటిని ఆయన పరిశీలించి తగు జాగ్రత్తలను పోలీసు అధికారులు తీసుకోవాలని కోరారు. సాలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి విష్ణుచరణ్, రూరల్ సీఐ బాలకృష్ణ, పట్టణ సీఐ వాసుదేవరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రామతీర్థంలో ఆదిత్య హృదయ హోమం


యాగశాలలో హోమాలు జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ రామస్వామి వారి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలనంతరం యాగశాలలో సుందరకాండ, ఆదిత్య హృదయం, గాయత్రీ రామాయణం, సుదర్శన అష్టకం, సుదర్శన హవనం, తదితర హోమాలను వైభవంగా జరిపించారు. అనంతరం స్వామి వెండి మండపం వద్ద సీతారాముల నిత్యకల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, సాయిరామాచార్యులు, కిరణ్ పాల్గొన్నారు.

కొట్లాటపై కేసు నమోదు

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామంలో ఆదివారం ఇరువురి మధ్య జరిగిన కొట్లాటపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు... లింగాలవలస గ్రామానికి చెందిన బాడితబోయిన శ్రీను కాంట్రాక్టు పద్ధతిలో భీమిలిలో పోస్టుమాన్‌గా విధులు నిర్వహిస్తూ ఖాళీ సమయంలో ఆటో నడుపుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. త్వరలోనే తన ఇంట్లో శుభకార్యం ఉందని చెప్పి ఆదివారం సెలవు కావడంతో తన ఆటోలో బియ్యం ప్యాకెట్లను వేసుకుని పిండి ఆడించుకునేందుకు సవరవల్లి మిల్లుకు బయలు దేరాడు. ఈ క్రమంలో రోడ్డుకు అడ్డంగా వేరే వాహనాలు ఉండడంతో వాహనాలను పక్కకు తీయమని వాహన యాజమానులకు సూచించాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన ముని కిషోర్, సూర్యరావు, మాని సన్యాసినాయుడులు శ్రీనుతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడడంతో బాడితబోయిన శ్రీను తీవ్ర గాయాల పాలయ్యాడు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



మన్యంలో.. అభివృద్ధి ఘనం

పార్వతీపురం అంటేనే ఏజెన్సీకి ముఖద్వారం. వెనుకబడిన ప్రాంతం. కొండకోనలు.. దూరంగా విసిరిసేలా ఉండే గిరిశిఖర గ్రామాలు..ఒడిశా రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న ఈ ప్రాంతంలో గిరిజన జనాభా అధికంగానే ఉన్నారు. వలసల ప్రాంతంగా ఉన్న పార్వతీపురం.. నేడు ఆ పేరును చెరిపేసేలా అభివృద్ధి దిశగా పయనిస్తోంది.

- 58 నెలల్లోనే..సాధ్యం చేసి చూపిన ప్రభుత్వం
- జిల్లా ఆవిర్భావం తర్వాత దూసుకుపోతున్న ప్రగతి

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లాల ఆవిర్భావం తర్వాత పార్వతీపురం ప్రధాన కేంద్రంగా సాలూరు, కురుపాం..శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ నియోజకవర్గాలతో కలిపి పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడింది. మొత్తంగా నాలుగు నియోజకవర్గాలతో విస్తరించి ఉన్న జిల్లాలో కేవలం 58 నెలల కాలంలోనే ఎంతో ప్రగతి సాధించింది.

రూ.100 కోట్లతో సమీకృత కలెక్టరేట్ సముదాయం


కలెక్టర్ కార్యాలయం

కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో కలెక్టరేట్‌తోపాటు, ఇతర జిల్లా కార్యాలయాలన్నీ ఏర్పాటయ్యాయి. దీంతోపాటు..పార్వతీపురంలోనూ, సీతంపేటలోనూ ఐటీడీఏల ద్వారా గిరిజనులకు మెరుగైన సేవలందుతున్నాయి. ప్రస్తుతానికి ఐటీడీఏ కోసం నిర్మించిన భవన సముదాయంలోనే కలెక్టరేట్ నడుస్తోంది. శాశ్వత భవనాల నిర్మాణం కోసం ఇటీవలే రూ.99.90 కోట్లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని అడ్డాపుశీలలో నిర్మించనున్నారు. స్థలం ఎంపిక కూడా పూర్తయింది. ఇందుకోసం 59.80 ఎకరాల భూమిని కేటాయించారు.

ఇవి కాక.. జిల్లాలో 311 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం ప్రారంభం కాగా..130కిపైగా పూర్తయ్యాయి. 301 ఆర్‌బీకేలు, 192 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, 85 డిజిటల్ లైబ్రరీలు, 19 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు మంజూరు కాగా.. చాలావరకూ పూర్తయ్యాయి.


జిల్లా ఆస్పత్రి

అందుబాటులోకి విద్య, వైద్యం

జిల్లాకొక వైద్యకళాశాల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్న నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో రూ.600 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మించనున్నారు. పార్వతీపురం, సీతంపేటల్లో రూ.50 కోట్ల చొప్పున వ్యయంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం జరగనుంది. పలు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలను ఆధునికీకరించారు. ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఏజెన్సీ వాసులకు వైద్యపరమైన కష్టాలు తప్పుతాయి.

సాలూరులో గిరిజన వర్సిటీ

సాలూరు నియోజకవర్గం పరిధిలో విశాలమైన ప్రాంగణంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శాశ్వత భవనాల నిర్మాణ పనులు సాగుతున్నా యి. కేంద్ర ప్రభుత్వం రూ.835 కోట్లను మంజూరు చేస్తే..రాష్ట్ర ప్రభుత్వం 519 ఎకరాల భూమితో పాటు, మంచినీటి సరఫరా కోసం రూ.7 కోట్లు, అనుసంధాన రహదారులు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.16 కోట్లు, విద్యుత్తు సదుపాయానికి రూ.3.34 కోట్లు కేటాయించింది.



వేలాది ఉద్యోగాల భర్తీ

సచివాలయాలతో వేలాది ఉద్యోగాలను భర్తీ చేశారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 350 సచి వాలయాలుండగా.. ఇందులో 3,500 పోస్టులను అర్హతే ప్రామాణికంగా భర్తీ చేశారు. వారికి అనుగుణంగా 5,600 మంది వలంటీర్లను గౌరవ వేతనంతో నియమించారు. జిల్లాలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు నాలుగు చోట్ల ఉన్నాయి. ఇక్కడ 1,300 మందికిపైగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించారు. ఉమ్మడి జిల్లాలో 1,631 మంది ఉద్యోగులు సర్వీసు క్రమబ ద్ధీకరణకు నోచుకున్నారు.

కురుపాంలో ఇంజినీరింగ్ కళాశాల


కురుపాంలో గిరిజన విశ్వవిద్యాలయం

కురుపాం నియోజకవర్గ పరిధి కురుపాం పంచాయతీలో ఉన్న టేకరఖండి గ్రామ సమీపంలో 105 ఎకరాల్లో రూ.190 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ కళాశాల పూర్తయితే మన్యం జిల్లాలో ఉన్న కురుపాం, పార్వతీపురం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల పరిధిలోని అధిక సంఖ్యలో గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య అందే అవకాశం ఉంది.

'సంక్షేమ' దన్ను

ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా నిరక్షరాస్యులే. గతంలో వారికి ఏ పథకాలూ సక్రమంగా అందేవి కావు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి మారింది. లబ్ధిదారుల ఖాతా లకే నేరుగా ప్రభుత్వం నగదు జమ చేయడం వల్ల ఆ మొత్తం వారి ఆర్థిక అవసరాలకు, చిరు వ్యాపారాలు చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతోంది.

పారిశ్రామిక ప్రగతి దిశగా..

జిల్లాలో పరిశ్రమల ఆవశ్యకత చాలా ఉంది. యువతకు ఉపాధి కల్పనకు, వలసల నివారణకు పారిశ్రామికీకరణ చాలా అవసరం. జిల్లాలో ఈ ఏడాది సింగిల్ డెస్క్ విధానంలో రూ.48.29 కోట్ల విలువ పెట్టుబడులు గల 50 యూనిట్లకు అనుమతులు మంజూరు చేశారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

మన్యం జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. పీఎంజీఎస్‌వై, ఆర్‌సీఈపీఎల్ డబ్ల్యూ తదితర గ్రాంట్ల కింద 1,008 రహదారి పనులు రూ.1,260 కోట్లతో జరుగుతున్నాయి. కేవలం గత ఏడాది కాలంలోనే 58 రహదారులకు అటవీ అనుమతులు మంజూరు చేసి మారుమూల ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నారు. జిల్లాలో ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో సమాచార వ్యవస్థను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడానికి 196 4జీ సెల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇందులో సగానికిపైగా పూర్తయి సేవలందిస్తున్నాయి.

పర్యాటక సొబగు

అందమైన, సుందర ప్రదేశాలు గల జిల్లాలో పర్యాటకానికి ఎన్నో అవకాశాలున్నాయి. వాటిని వినియోగించుకుని పార్వతీపురం మన్యం జిల్లా పర్యాటకానికి నిలయంగా మారాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రధానంగా సీతంపేటలో గిరిజన మ్యూజియం, జగతిపల్లి, అడలి వ్యూ పాయింట్‌ల వద్ద పర్యాటక పనులను రూ.1.40 కోట్లతోనూ, గుమ్మలక్ష్మీపురం మండలం ఎస్.కె.పాడులో ఎకో టూరిజం ప్రాజెక్టు పనులు రూ.1.80 కోట్లతోనూ చేపడుతున్నారు.


జియ్యమ్మవలస మండలంలో బల్లేరు నుంచి బల్లేరుగూడకు బీటీ రహదారి

పాఠశాలల అభివృద్ధి

నాడు-నేడుతో ప్రభుత్వ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. తొలిదశలో 486 పాఠశాలల్లో రూ.130.14 కోట్లలో అభివృద్ధి పనులు జరిగాయి. రెండో విడతో రూ.144.51 కోట్లతో 535 పాఠశాలల్లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి పదో తరగతి వరకు చదివే పిల్లలకు జగనన్న విద్యాకానుక కిట్లను ఏటా ప్రభుత్వం అందిస్తోంది. ఇందులో మూడు జతల యూనిఫాం దుస్తులు(క్లాత్), బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, డిక్షనరీ వంటివి ఉంటాయి. జిల్లాలో ఏటా సుమారు 96 వేల మంది విద్యార్థులు ఈ లబ్ధి పొందగా.. ప్రభుత్వం ఇందుకోసం రూ.18 కోట్లకు పైగా ఏడాదికి ఖర్చు చేస్తోంది. పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం గత ఏడాదిలోనే రూ.35.23 కోట్లను జిల్లాలో ఖర్చు చేశారు.

వైఎస్సార్ పింఛన్‌కానుక కింద 1,43,000 మంది పింఛనుదారులకు నెలకు రూ.37 కోట్లు పంపిణీ చేస్తున్నారు. 'వైఎస్సార్ ఆసరా కింద 16,699 మహిళా సంఘాలకు రూ.378 కోట్లు, వైఎస్సార్ చేయూ త ద్వారా 77,995 మందికి రూ.147 కోట్లు, వైఎ స్సార్ కల్యాణమస్తు కింద 1,700 మందికి రూ. 11.84 కోట్లు, వాహనమిత్ర పథకం ద్వారా సొంత ఆటో, ట్యాక్సీ నడిపేవారికి రూ.10 వేలు చొప్పున రూ.50 వేలు అందించారు. ఇలా జిల్లాలో ఏడాదికి 5,664 మంది రూ.8.28 కోట్ల మేర లబ్ధి పొందారు. జగనన్న తోడు 7,460 మందికి రూ.7.59 కోట్లు చొప్పున లబ్ధి కలుగుతోంది.


సామాజిక పింఛన్ల పంపిణీ(ఫైల్)

సొంతింటి కల సాకారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పేదల సొంతింటి కల సాకారమైంది. జిల్లావ్యాప్తంగా 27,142 మందికి ఇళ్లు మంజూరు కాగా.. ఇప్పటికే 14 వేల మంది నిర్మాణం పూర్తి చేసుకుని, గృహ ప్రవేశాలు చేశారు. పీఎంఏవై- గ్రామీణ్ పథకం కింద 2021- 22 సంవత్సరానికి 7,306 ఇళ్లు మంజూరు కాగా.. 1,400కుపైగా పూర్తయ్యాయి. సాలూరు పురపాలక సంఘం పరిధిలో 1,152 మందికి టిడ్కో గృహాలను ఇటీవలే లబ్ధిదారులకు అప్పగించారు. పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో 768 గృహాలను అందజేయనున్నారు.


పార్వతీపురం మండలంలో జగనన్న కాలనీ

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

పార్వతీపురం: సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయింపునకు రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ఆదివారం పూర్తయింది. ఈ ప్రక్రియను అరకు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్దా పర్యవేక్షణలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్.శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

సాధారణ ఎన్నికల్లో పోలింగ్ విధులకు హాజరు కానున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు మే 5వ తేదీన, పోలీసు సిబ్బంది మే 6వ తేదీన, అత్యవసర సేవలు, ఇతర శాఖల సిబ్బంది మే 7వ తేదీన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అనివార్య కారణాలవల్ల నిర్దేశించిన రోజుల్లో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశంలేని సిబ్బంది ఆ మూడు రోజుల్లో ఏదో ఒక రోజు ఓటుహక్కును వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్న పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా, కలెక్టర్ నిషాంత్‌కుమార్, జేసీ శోభిక, డీఆర్ఓ కేశవనాయుడు

ప్రభుత్వ పనిప్రదేశంలో ప్రచారం?

- ఎన్నికల అధికారులు స్పందించాలని వైఎస్సార్‌సీపీ విన్నపం

సాలూరు: ప్రభుత్వ నిధులతో పని జరుగుతున్న ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారం చేయడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు కాదా? అని వైఎస్సార్‌సీపీ పాచిపెంట మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ తట్టికాయల గౌరిశ్వరరావు తదితరులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు మండలంలోని కర్రివలస పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పని జరుగుతున్న ప్రాంతం వద్దకు సాలూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి శనివారం వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న వేతనదారులకు స్థానిక టీడీపీ నాయకులు ఆ పార్టీ టోపీలను పంచిపెట్టగా, సంధ్యారాణి ప్రచారం చేయడాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పుబట్టారు. ఇలా ప్రభుత్వం వేతనాలు ఇస్తున్న ఉపాధి హామీ పని ప్రాంతానికి వెళ్లి సంధ్యారాణి ప్రచారం చేయడం, పైగా అక్కడ వేతనదారులందరికీ టీడీపీ టోపీలు ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు వస్తుందా? రాదా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజ్నన దొర దృష్టికి తీసుకువెళ్తామని, ఈసీకి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్పందించాలని కోరారు.


వేతనదారులకు టీడీపీ టోపీలు ఇచ్చి ప్రచారం చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని సంధ్యారాణి


బాలేరు సమీప పంటపొలాల్లో ఏనుగుల గుంపు

బాలేరు సమీపంలో ఏనుగులు

భామిని: మండలంలోని తాలాడ సమీప తోటల నుంచి ఏనుగుల గుంపు ఆదివారం బాలేరు వైపు నడిచింది. తోటల సమీపంలోని మొక్కజొన్న పంటల కోతలు పూర్తి కావడంతో సరైన మేత లేక బాలేరు పంటపొలాలకు తరలివెళ్లాయని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా ఉదయానికే పంటపొలాల్లో నాలుగు ఏనుగుల గుంపు పంట చేలను తినివేశాయని రైతులు వాపోతున్నారు.

ప్రణాళికా బద్ధంగా రిసెప్షన్ కౌంటర్లు

- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్:

ఎన్నికల రిసెప్షన్ కౌంటర్ల ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా జరగాలని, సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రిసెప్షన్ సెంటర్ సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం శిక్షణ ఇచ్చారు. కౌంటర్ల ఏర్పాటు, విధులు, సదుపాయాలు, పార్కింగ్ తదితర అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. రోజంతా ఎంతో కష్టపడి ఎన్నికల విధులను నిర్వహించి, ఈవీఎం ఇతర సామగ్రితో తిరిగి వచ్చే సిబ్బంది బస్సులో నుంచి దిగగానే తాము వెళ్లాల్సిన కౌంటర్లకు సులభంగా చేరుకునేలా డైరెక్షన్ బోర్డులు, నేమ్ బోర్డులు ఉండాలన్నారు. తాగునీరు, ఫుడ్ కౌంటర్లు, మరుగుదొడ్లు, పార్కింగ్ ప్రదేశాలను తెలియజేసేలా పెద్దసైజులో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో నియోజకవర్గానికి సుమారు 10 నుంచి 12 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడే ఈవీఎలను, ముఖ్యమైన పత్రాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. సాధారణ కౌంటర్లలో ఇతర ఎన్నిక సామగ్రిని సమర్పించాలని చెప్పారు. స్పెషల్ కౌంటర్‌లో నలుగురు సిబ్బంది, ఇద్దరు సహాయకులు, ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు మరో ఇద్దరు సహాయకులు ఉంటారని తెలిపారు. సాధారణ కౌంటర్‌లో ఇద్దరు సిబ్బంది, సహాయకులు, సామగ్రిని తరలించేందుకు మరో ఇద్దరు సహాయకులు ఉంటారని వివరించారు. ఒక్కో రిసెప్షన్ సెంటర్ పర్యవేక్షణకు ఇద్దరు జిల్లా అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించామని కలెక్టర్ వివరించారు. విజయనగరం, బొబ్బిలి అసెంబ్లీ స్థానాలను ఓట్లు లెక్కింపు జరిగే జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ రిసెప్షన్ సెంటర్‌కు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, మిగిలిన అసెంబ్లీ స్థానాల లెక్కింపు జరిగే లెండి కళాశాలకు మెప్మా పీడీ సుధాకర్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావును ఇన్‌చార్జిలుగా నియమించినట్లు వెల్లడించారు. రిసెప్షన్ సెంటర్‌లో టాబ్యులేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఓటర్ల నమోదు వివరాలను అక్కడే సమర్పించాలని సూచించారు. పరిశీలకుల కోసం కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, మరుసటి రోజు అక్కడ స్క్రూటినీ చేస్తామని తెలిపారు. ఏ కౌంటర్లో ఇవ్వాల్సిన వివరాలను అక్కడే ఇవ్వాలన్నారు. ఏమైనా సందేహాలు తలెత్తితే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. స్పెషల్ కౌంటర్‌లో సమయ నిర్వహణ చాలా కీలకమని, ఇక్కడ పని వేగంగా జరగాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను నిర్దేశించిన విధంగానే భద్రపరచాలని చెప్పారు. సెక్టార్ అధికారుల కౌంటర్లో రిజర్వుడు ఈవీఎంలను అందజేయాలని సూచించారు. కౌంటర్లలోని సిబ్బంది, పీఓలు ఇచ్చే వివరాలను చాలా జాగ్రత్తగా తనిఖీ చేయాలని, కచ్చితమైన వివరాలను మాత్రమే నమోదు చేసేలా చూడాలని చెప్పారు. ఎన్నికల సిబ్బంది అందరికీ మంచి భోజనాన్ని ఏర్పాటు చేయాలని, తాగునీరు, ఇతర అవసరాలను ఇబ్బంది పడకుండా చూడాలని కలెక్టక్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఎస్.డి.అనిత, పార్లమెంట్ ఏఆర్ఓ సుమబాల, రిటర్నింగ్ అధికారులు, వేదిక ఇన్‌చార్జిలు, నోడల్ అధికారులు, ఏఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.


హాజరైన జిల్లా అధికారులు


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

టేకు తోట దగ్ధం

బొండపల్లి: మండలంలోని కంచిరెడ్డిపాలెంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాలుగు ఎకరాల విస్తీర్ణంలోని టేకు తోట దగ్ధమైంది. గ్రామానికి అనుకొని రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారానికి మంటలు అంటుకొని క్రమంగా సమీపంలోని టేకు తోటకు మంటలు వ్యాపించాయి. గజపతినగరం అగ్ని మాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సంతకవిటి: నాగావళి నదీ తీరం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న తాలాడ గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ షేక్ శంఖర్ తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంతర్జాతీయ చెస్ ఓపెన్ ఫిడే రేటింగ్ టోర్నీలో ఆటగాళ్ల హవా

విజయవాడ స్పోర్ట్స్: స్పార్క్ చెస్ అకాడమీ మొదటి అంతర్జాతీయ చెస్ ఓపెన్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌లో నాల్గవ రోజు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుల హవా కొనసాగింది. ఈ నెల 25న కానూరులోని షామ్ రాక్ స్కూల్‌లో ప్రారంభమైన ఈ పోటీలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయి. మొత్తం పది రౌండ్లు జరిగే ఈ పోటీలు ఆదివారం నాటికి ఏడు రౌండ్లు పూర్తయ్యాయి. ఏడో రౌండ్ ముగిసే నాటికి ఎండీ ఇమ్రాన్(విజయవాడ), హరీష్‌సాయిరామ్(విజయవాడ), శ్రీషణ్ముక్‌చంద్ర(తెలంగాణ), శ్రీనివాసరావు(కృష్ణా జిల్లా), అఖిల్‌ప్రసాద్(విశాఖపట్నం), లక్ష్మీచరణ్‌నాయుడు(విజయనగరం), సీతాసాగర్(తూర్పు గోదావరి), మోహిత(గుంటూరు), భావన్(విజయవాడ), ధనుష్(అనకాపల్లి) టాప్ టెన్‌లో కొనసాగుతున్నారు. ఈ పోటీలకు 405 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.


చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు